దోపిడీ దొంగలు అధికం. ఆ ధనవంతుడి నించి దొంగలు సర్వం దోచుకుని, కొట్టి పారిపోయారు. రక్తసిక్తమైన అతను నేలమీద పడి ఉన్నాడు. ఓ మతాధికారి ఆ దారిన వెళ్ళాడు కాని ఆ ధనవంతుడికి ఏ సాయం చేయలేదు. తర్వాత ఓ లెవైట్ వెళ్ళాడు. చివరగా సమారియా దేశానికి చెందిన ఓ సమారిటన్ వెళ్తూ చూసి, అతనికి సపర్యలు చేసి బ్రతికించాడు. ఆ ముగ్గురిలో ఎవరు ఆ ధనవంతుడికి ఇరుగు పొరుగు వాడు?" ప్రశ్నించాడు జీసస్.

ఇరుగు పొరుగు వాడంటే, సహాయం పొందే దీన స్థితిలో ఉన్నవారంతా ప్రపంచంలోని ఏ ప్రాంతానికి చెందినవాడైనా సరే, మన ఇరుగు పొరుగు వాడవుతాడు. మనకి ఎలాంటి సంబంధం లేనివారిని కూడా ఆదుకోడానికి మనం ముందుకు రావాలి అని జీసస్ బోధించాడు.

## 116. పరీక్ష

ఓ ఫిలాసఫీ ప్రొఫెసర్ చాలా స్ట్రిక్ట్‌గా ఉండేవాడు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులని క్లాసులోకి రానిచ్చేవాడు కాడు.

ఓ రోజు ఆయన పేరబుల్స్ (నీతి కథలు) సబ్జెక్ట్ మీద పరీక్ష పెడుతున్నాడు. దానికి హాజరవడానికి విద్యార్థులంతా వచ్చారు. కాని క్లాసు గది దగ్గరున్న కాలేజీ ప్యూన్, ఆ క్లాసుని వేరే గదికి షిఫ్ట్ చేసామని చెప్పాడు. విశాలంగా ఉన్న ఆ యూనివర్సిటీ కేంపస్‌లో దూరంగా ఉన్న ఆ గది వైపు వెంటనే విద్యార్థులంతా హడావిడిగా పరిగెత్తారు.

వారి దారిలో తాగి లేవలేక రోడ్డు మీద పడిపోయి మంచినీళ్ళు ఇవ్వమని సౌంజ్ఞ చేస్తున్న ఒకతన్ని చూసారు కాని పరీక్షకి లేటవుతుందని ఎవరూ అతనికి సహాయం చేయడానికి ఆగలేదు. అంతా క్లాసులోకి వచ్చాక చెప్పాడు ప్రొఫెసర్.

"మీరంతా ఈ పరీక్షలో ఫెయిలయ్యారు."

"అదేమిటి? రాయకుండానే?" తెల్లబోతూ అడిగాడో విద్యార్థి.

"అవును. ఇవాళ మీకు పెట్టిన పరీక్ష కాగితాల మీద కాదు. దారిలోని దాహంగొన్న వాడికి సహాయం చేయలేని మీరు ఎన్ని నీతికథలు చదివి ఏం ప్రయోజనం?"

అదంతా ఆ ప్రొఫెసర్ ఆడిన నాటకం అని విద్యార్థులంతా గ్రహించి తమ ప్రవర్తనకి సిగ్గుపడ్డారు.

## 117. శాకాహారం

ఓ హిందూ గురువు లాస్ ఏంజెలెస్ లోని ఓ ఆశ్రమంలోని అమెరికన్ శిష్యులకి శాకాహారం తినడం ఆధ్యాత్మిక ప్రగతికి ముఖ్యమని చెప్తున్నాడు.

వెంటనే ఓ అమెరికన్ లేచి అడిగాడు.

"మీరు నిజంగా శాకాహారేనా?"

"అవును." జవాబిచ్చాడు గురువు.

"మీరు ఆవు నించి వచ్చిన పాలు తాగుతే తప్పు కానిది, మరి మేం ఆవు నించి వచ్చిన మాంసాన్ని తింటే తప్పేమిటి?" ప్రశ్నించాడు అతను.

"నువ్వు మీ అమ్మ నించి వచ్చిన పాలు తాగగా తప్పు లేనిది, మీ అమ్మ మాంసాన్ని తింటే కూడా తప్పు లేకపోతే, అప్పుడు నువ్వు చెప్పిందాంట్లో కూడా తప్పు లేదు."

ఆ అమెరికన్ నించి జవాబు లేదు.

"అందుకే మేము గోవుని మాతగా భావించి, దాని మాంసాన్ని తినం." జవాబు చెప్పాడు గురువు.

## 118. ఆనంద మార్గం

"స్వామీ. ఎప్పుడూ ఆనందంగా వుండాలంటే ఏం చెయ్యాలి?" ఒకరు ఓ యోగిని అడిగారు.